## MISFORTUNE IS AN OCCASION TO DEMONSTRATE YOUR CHARACTER AND WILL POWER!!

### కథ

# డాక్టర్ కీర్తన

★★★

రెండ్రోజుల క్రిందట గుండె మార్పిడి ఆపరేషన్ నిర్వహించిన పేషెంట్ పరిస్థితి ఎలా ఉందో పరిశీలించి ఐ.సి.సి.యు. నుంచి బయటకు వచ్చి తన ఛాంబర్ లోకి వెళ్లింది డాక్టర్ కీర్తన.

సీట్లో కూర్చున్నదో లేదో ఇంటర్‌కమ్‌లో దశరథ్ చెప్పాడు- ''మేడమ్! ఇర్రెగ్యులర్ హార్ట్‌బీట్‌తో ఒక కేసు వచ్చిందిప్పుడే. మీరోసారి....''

అర్థింపుకన్నా, 'అదేవిటో మాకు అంతుపట్టడం లేదు' అన్న అశక్తత ఎక్కువ స్పష్టమవుతోంది దశరథ్ గొంతులో.

''వస్తున్నాను'' ఫోన్ పెట్టేసి బయల్దేరింది కీర్తన.

★★★

ఏ.ఎం.సీ. బయట ఆందోళన పడుతున్న ఒక ముప్పై ఏళ్ల స్త్రీ కనిపించింది కీర్తనకు. ఆ స్త్రీ చేతిని పట్టుకుని శబ్దం రాకుండా ఏడుస్తోంది ఓ పాప. నాలుగైదేళ్ల వయసుంటుందేమో ఆ పాపకి.

''డాడీ...డాడీ...'' అంటూ విపరీతంగా ఏడుస్తోంది.

అది హాస్పిటల్ అనీ, చుట్టూ-ఉన్న వాళ్లు ఏమయినా అంటారేమోనన్న బిడియంతో శబ్దం పెద్దగా రాకుండా అదుపుచేసుకుంటూ ఏడుస్తోంది. ఓదార్పుకతీతంలా వుంది ఆ పసిపాప దుఃఖం.

ఆ పాపను చూడగానే మనసు కదిలిపోయింది కీర్తనకు. ఏ.ఎం.సి. స్వింగ్‌డోర్ తెరుచుకుని లోపలికి వెళ్లిన కీర్తనను చూడగానే దశరథ్, అతనితోబాటున్న మరో ముగ్గురు డాక్టర్లూ అలెర్ట్ అయినట్టుగా కదిలారు.

ముప్పై ఐదూ నలభై మధ్య వయసుంటుంది ఆ పేషెంట్‌కి. తెల్లగా ఉన్నాడు. అతన్ని పరీక్షించింది కీర్తన. అతని ఛాతీ మీద ఎడమవైపు చేయిపెట్టి చూసింది. 'ధఢ్...ధఢ్...!' చాలా గట్టిగా కొట్టుకుంటోంది అతని గుండె.

ఆమె చేయి పైకీ క్రిందకీ కదలడం స్పష్టంగా కనిపిస్తోంది అందరికీ. ఆమె భృకుటి ముడుచుకుంది. ఒక విధమైన ప్రొఫెషనల్ అలెర్ట్ వచ్చేసింది. చకచకా కొన్ని పరీక్షలు నిర్వహించి, ''దిసీజ్ వీ.టీ.'' చెప్పింది డాక్టర్ దశరథ్‌తో.

''వెంట్రిక్యులర్ టేకీకార్డియా?'' సందేహంగా అడిగాడు దశరథ్.

''అవును. పేషెంట్‌తో ఎవరొచ్చారు?''

''అతని భార్య, కూతురు. బయట ఉన్నారు మేడమ్''

''వాళ్లనొకసారి రమ్మనండి'' అన్నట్టుగా చేత్తో సంజ్ఞ చేసింది కీర్తన.

అర నిమిషం తర్వాత తలుపు తెరుచుకుని లోనికి వచ్చిన ఆ ఇద్దర్నీ చూడగానే, ఇందాక తను లోపలికి వచ్చేటప్పుడు చూసినవాళ్లే అనుకుంది కీర్తన.

బెడ్‌మీద మానిటర్లూ ఇతర మెడికల్ ఎక్విప్‌మెంట్ల మధ్య అలా పడి ఉన్న తండ్రిని చూడగానే ఆ పాప ''డాడీ...'' అంటూ ఏడ్వేయసాగింది. తండ్రి పరిస్థితికి తల్లడిల్లిపోతున్న ఆ పాపను చూడగానే డాక్టర్ కీర్తనకు మనసు ద్రవించిపోయింది. ఒక నీటి తెర కనురెప్పల్ని తోసుకుంటూ ముందుకురికింది, ముప్పై ఏళ్ల నాటి జ్ఞాపకాల్ని మనసు ముందుకు తెస్తూ!

★★★

ప్రక్క గదిలోంచి వినిపిస్తున్న శబ్దం, తన కూతురు వెక్కి వెక్కి పడడం అని గ్రహించగానే వంట గదిలో చేస్తున్న పనిని ఆపి అక్కడకు వెళ్లింది వసుంధర.

తండ్రి ఫొటోని గుండెలకు హత్తుకుని ఏడుస్తోంది నాలుగేళ్ల కీర్తన. కుడి చేతి చూపుడు వేలుని ఫొటోలోని తండ్రి ముఖం మీదకు పోనిస్తూ-''డాడీ...!'' కన్నీళ్ల మధ్య చెప్తోంది కీర్తన.

''....నువ్వు మళ్లీ ఇంటికి తిరిగి రావచ్చు కదా డాడీ!'' కూతురుని అలా చూడగానే చాలా బాధగా అనిపించింది వసుంధరకు.

ఒక ప్రయివేట్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్న వసుంధరకు 24 ఏళ్లు! తొమ్మిది నెలల క్రితం భర్త వంశీకృష్ణ, హార్ట్‌ఎటాక్‌తో చనిపోయినప్పుడు ఆ షాక్ నుంచి బయటపడడం ఎంతో కష్టమైపోయిందామెకి. కానీ-తన కూతురి దుఃఖాన్ని చూసి భరించడం మాత్రం సాధ్యం కావడంలేదు!

విజయవాడలోనే పరిచయమయ్యాడు వంశీకృష్ణ ఆమెకి. వాళ్ల పరిచయం సుడిగాలి వేగంతో ప్రణయమై వివాహంగా మారింది. పెళ్లయిన రెండేళ్లకే కీర్తన పుట్టింది. వంశీకి కూతురంటే విపరీతమైన ప్రేమ. 'డాడీ నోట్లో నుంచి ఊడిపడిందిది' అంటూ అప్పుడప్పుడు వసుంధర చెప్తుంటే గర్వంతో వంశీ కళ్లు మెరిసేవి. అన్ని చోట్లకీ తండ్రీకూతుళ్లు కలిసే వెళ్లేవాళ్లు. కూరగాయల మార్కెట్‌కీ, మార్నింగ్ వాక్‌కీ, కృష్ణానదిలో ఈతకీ, లైబ్రరీకి, ఐస్‌క్రీం పార్లర్‌కీ...!

తండ్రి మరణించాడన్న వాస్తవానికి క్రమక్రమంగా అడ్జస్టవడం పోయి, దాన్నసలు అంగీకరించడం లేదు కీర్తన! ''డాడీ ఇంటికొస్తారు. ఆఫీస్ పనికి వెళ్లారు'' అని చెప్తుంది తల్లితో. బొమ్మ టెలిఫోన్‌తో, ఆడుకుంటూ అతనితో కబుర్లు చెబుతున్నట్లు మాట్లాడుతుంది.

''అయ్ మిస్ యు డాడ్. ఇంటికి ఎప్పుడొస్తావ్ నువ్వు మళ్ళీ?''

వంశీకృష్ణ చనిపోయాక, వాళ్ళుండే ఫ్లాట్ వదిలి, అదే ఊర్లో ఉండే తన తల్లిదండ్రుల దగ్గరకు వెళ్ళిపోయింది వసుంధర మార్పుకోసం.

దహన సంస్కారాలు పూర్తయి ఏడువారాలైనా, కీర్తనను ఓదార్చటం చాలా కష్టమయిపోయింది.

''నాకసలు ఏం చేయాలో తెలీడం లేదమ్మా'' అంటూ తన తల్లి జానకితో చెప్పింది వసుంధర. రెండుసార్లు కీర్తనను పిల్లల డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళారు వాళ్ళు. కానీ అదీ ఏ రకంగానూ సాయపడలేదు. ఆఖరికి ఒకరోజు జానకి, వంశీ సమాధి దగ్గరకు తీసుకువెళ్ళింది కీర్తనని! కనీసం, అలాగైనా, ఆ పసిపాప తన తండ్రి మరణించాడన్న నిజాన్ని అర్థం చేసుకుని, సమాధానపడటం తెల్సుకుంటుందనే ఆశతో. కానీ- ఆ పాప సమాధి రాయి మీద తల ఆన్చి చెప్పింది, ''నేను సరిగా జాగ్రత్తగా వినివుంటే, డాడీ నాతో మాట్లాడేది వినపడేదే అమ్మమ్మా!'' ఆ తర్వాత ఒక సాయంత్రం-

వసుంధర తన బిడ్డను దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకుంది. అప్పుడు కీర్తన అంది, ''నాకు చచ్చిపోవాలని ఉంది మమ్మీ. అప్పుడు నేను డాడీతో ఉండొచ్చు''

★★★

ఆ రోజు నవంబర్ 8, 1970. బతికి ఉండుంటే అది వంశీ 32వ పుట్టిన రోజయ్యేది. ''డాడీకి గ్రీటింగ్ కార్డ్ ఎలా పంపించాలి?'' అనడిగింది కీర్తన అమ్మమ్మ జానకిని. ఒక్కక్షణం మనవరాలి ముఖంలోకి చూసి చెప్పింది జానకి- ''లెటర్ రాసి బెలూన్‌కి కట్టి, దాన్ని స్వర్గం వరకూ పంపిస్తే!'' కీర్తన కళ్ళు వెలిగాయి.

ఒక బుట్ట నిండా పూలని నింపుకుని ఆటోలో స్మశాన వాటికకు బయల్దేరారు ఆ ముగ్గురూ. దార్లో ఒక కొట్టు దగ్గర ఆగారు. ''మమ్మీతో వెళ్ళి, మంచి బెలూన్ సెలెక్ట్ చెయ్యి'' చెప్పింది జానకి మనవరాలితో.

ఆ స్టోర్‌లోని ఒక ర్యాక్‌లో, హీలియం నింపిన వెండిరంగు బెలూన్లు డజన్ల కొద్దీ అమర్చి ఉన్నాయి. కీర్తన వాటివంక పరిశీలనగా చూసి ''అదీ'' చూపించింది తల్లికి. 'హేపీబర్త్‌డే' అన్న అక్షరాలు ఉన్నాయి ఆ బెలూన్ మీద. వాల్ట్‌డిస్నీ మిక్కీమౌస్ బొమ్మ కూడా ఉంది. కీర్తనా, ఆమె తండ్రీ వాల్ట్‌డిస్నీ సినిమాలు చాలా చూశారు కల్సి.

వంశీ సమాధి మీద పూలను అమర్చుతూంటే, ఆ పాప కళ్ళు మెరిశాయి. ఆ సమాధికి కాస్త ఎడంగా ఉన్న పెద్ద వేపచెట్టు గాలికి కదుల్తోంది.

తండ్రికి లెటర్ని డిక్టేట్ చేసింది కీర్తన. ''రాయి అమ్మమ్మా..''

''చెప్పు'' అంది జానకి, పెన్ క్యాప్ తెరిచి.

''హేపీబర్త్‌డే చెప్పానని రాయి. అయ్ లవ్ యు అండ్ అయ్ మిస్ యు అని కూడా. ఈ లెటర్ నీకు చేరుతుందనీ, జనవరిలో నా బర్త్‌డేకి నువ్వు మళ్లీ నాకు రాస్తా ఎ ని



అ.ను.కుం.టు.న్నా.ను!''

ఆ మాటల్ని వాళ్ళ చిరునామానీ ఒక న్న పేపర్ మీద రాసింది జానకి. ఆ పేపర్‌ని చిన్న ప్ల క్ ముక్కకి చుట్టి బెలూన్‌కి ఉన్న తాడుకి కట్టింది ఆ . తర్వాత కీర్తన ఆ బెలూన్‌ని పైకి వదిలింది! దాదా గంట సేపటికి ఆ బెలూన్ క్రమక్రమంగా చిన్న మారిపోయింది పైకి వెళ్ళేకొద్దీ. ముగ్గురూ తలల పైకెత్తి దాని వంకే చూస్తున్నారు.

''కీర్తీ! ఇంక ఇంటికి వెళ్దాం అ '' జానకి చెప్పింది. వసుంధరా, జానకీ వెనుదిరిగి ల్లిగా అడుగులు వేస్తుంటే, కీర్తన ఉత్సాహంగా అరి చెప్పింది.

''మీరు చూశారా అది? డాడీ వచ్చి న్ని తీసుకున్నారు!'' కొన్నిక్షణాల వరకూ కనిపిస్తు ఉన్న ఆ బెలూన్ అదృశ్యమైపోయింది.

''డాడీ నాకు లెటర్ రాస్తారు'' చెప్పింది కీర్తన చాలా నమ్మకంగా!

★★★

నవంబర్, 12.

కాలిఫోర్నియా.

కెన్‌గిల్ ఎప్పటిలానే ఆ ఉదయం కూడా ఇంటి ముందున్న గార్డెన్‌లో జాగింగ్ చేస్తున్నాడు. తండ్రితో బాటే ఎనిమిదేళ్ళ జాక్సన్ కూడా చిన్ని చిన్ని ఎక్సర్‌సైజులు చేస్తున్నాడు. క్రోటన్ పొద దగ్గర ఏదో కనిపించడంతో నుదురు చిట్లించి చూశాడు జాక్సన్. ఎక్సర్‌సైజులు ఆపి.

**గుమ్మడి రవీంద్రనాథ్**

వెండి రంగు బెలూన్!

దాని మీద 'హేపీ బర్త్‌డే డాడీ' అన్న అక్షరాల్ని చదివాడు. ''డాడ్!'' అరిచి చెప్పాడు. ''..లుక్ ఎట్ దిస్'' కొడుకు దగ్గరకు వచ్చాడు కెన్. బెలూన్ తాడుకి కట్టి ఉన్న ప్లాస్టిక్‌నీ దానికి చుట్టి ఉన్న పేపర్‌నీ తీసాడు కెన్. తండ్రితోబాటే, జాక్సన్ కూడా చదివాడు ఆ కాగితంలో రాసినదాన్ని. తండ్రీకొడుకులు ఇద్దరూ ఇంట్లోకి పరిగెట్టారు.

''రమ్యా'' భార్యను పిలిచి, ఆ కాగితాన్ని అందించాడు. రమ్య తెలుగమ్మాయే. చదువుకోసం, స్టేట్స్‌కి వచ్చినప్పుడు తన క్లాస్‌మేట్ అయిన కెన్‌ని ప్రేమించి

పెళ్ళి చేసుకుని కాలిఫోర్నియాలో స్థిరపడిపోయి ఓ. భర్తకీ, కొడుక్కీ కూడా కొంచెం కొంచెం తెలుగు నేర్పింది. నిజానికి, ఆమె నేర్పిందనడం కంటే వాళ్ళే నేర్చుకున్నారు అనొచ్చు. భృకుటి ముడిచి, ఆశ్చర్యంగా దాన్ని చదివింది రమ్య.

"నవంబర్ 8, 1970 హేపీ బర్త్‌డే డాడీ.."

ఇండియాలోని విజయవాడ అడ్రస్‌తో మనసి ఉంది ఆ నోట్.

"ఇట్స్ వేర్లీ ట్రావెల్డ్.." సంభ్రమంతో విశాలమైన కళ్ళతో చెప్పింది రమ్య. "...ఈ బెలూన్ కొన్ని వేల కిలో మీటర్ల దూరం ప్రయాణం చేసింది ఈ కొన్ని రోజుల్లో!"

"కీర్తనకు లెటర్ రాద్దాం మమ్మీ మనం" కుతూహలమే కాదు స్పష్టమైన కన్‌సర్న్ కూడా ధ్వనించింది జాక్సన్ స్వరంలో.

ఆ బాబు ఇంగ్లీషులో చెప్పాడు ఆ మాట. రమ్య కొడుకు భుజం మీద చేయి వేసి మౌనంగా ఉండిపో యింది. క్షణమాగి చెప్పింది. "పాపం! అంత చిన్న పాపకు మరణానికి సంబంధించిన విషయాన్ని గురించి నచ్చచెప్పాల్సి రావడం..." రమ్య కళ్ళల్లోని చెమ్మను తను చూసాడు కెన్.

జాక్సన్, ఆ బెలూన్‌ని తన గది కిటికీ ఊచకి కట్టాడు. రమ్యకు ఆ రాత్రి చాలాసార్లు ఆ బెలూన్ గుర్తొచ్చింది. నిద్రపోతున్న కొడుకు వంక చూస్తూ "ఒక వేళ కెన్ చనిపోతే, జాక్సన్ ఎంత తల్లడిల్లి పోతాడో" ఊహించింది!

"కీర్తనకు లెటర్ రాద్దాం మమ్మీ మనం" ఉదయం కొడుకు అన్నమాట గుర్తొచ్చింది. లోపల్లోపలే నిర్ణయించుకుంది.

"యు ఆర్ రైట్ జాక్సన్. కీర్తనకు ఎలాగో ఒకలా మనం సాయపడాలి"

★★★

క్రిస్టమస్ పండుగ తర్వాత కొన్నిరోజులకి, రమ్య లోకల్ మార్కెట్‌కి వెళ్ళి ఓ గ్రీటింగ్ కార్డ్ కొన్నది. దాన్ని జాక్సనే సెలెక్ట్ చేశాడు. దాని మీద "ఫర్ ఎ డియర్ డాటర్! లవింగ్ బర్త్‌డే విషెస్" అని ఉంది.

ఒక రోజు ఉదయం హాల్లో కూర్చుని కీర్తనకు ఉత్తరం రాసింది. రాయడం ముగించి ఆ లెటర్ని మడిచి, గ్రీటింగ్ కార్డ్‌తో బాటు కలిపి కవర్‌లో పెట్టి, జనవరి 3న దాన్ని పోస్ట్ చేసింది.

★★★

జనవరి ఒకటిన, కీర్తన పుట్టిన రోజు వచ్చిందీ, నిశ్శబ్దంగా వెళ్ళిపోయింది. బెలూన్‌ని గాలిలోకి పంపినరోజు నుండీ, ప్రతిదినం కీర్తన తల్లిని అడుగుతూనే ఉంది. డాడీకి అది చేరి ఉంటుందంటావా మమ్మీ ఈ పాటికి?" అని. కానీ-

తన పుట్టినరోజు పార్టీ ముగిసినప్పటి నుండీ తల్లిని ఆ ప్రశ్నవేయడం మానేసింది!

★★★

జనవరి 19 సాయంత్రం సమయంలో రమ్య పంపిన కవర్ చేరింది.

జానకి ఆ కవర్ మీది ఫ్రమ్ అడ్రస్ చూసి, వంశీ వాళ్ళ కుటుంబీకులెవరో పంపిన బర్త్‌డే గ్రీటింగ్ అని భావించింది.

మర్నాడు ఉదయం, లబ్బీపేటలోని ఫ్లాట్‌కి వెళ్ళి, మనవరాలికి ఇవ్వాలనుకుంది. ఆ రాత్రి టీవీ చూస్తుం డగా, వచ్చింది జానకికి ఆ ఆలోచన.

కీర్తన బర్త్‌డేకి గ్రీటింగ్స్ ఈ అడ్రస్‌కి ఎవరు పంపు తారు? వాళ్ళ ఫ్లాట్ అడ్రస్‌కే పంపవచ్చుగా. ఆ కవర్ తెరిచి చూసింది జానకి.

" ఫర్ ఎ డియర్ డాటర్"

ఆవిడ గుండె వేగం ఒక్కసారిగా హెచ్చింది. కూతురు వసుంధరకి చెప్పాలని ఫోన్ అందుకుంది!

★★★

ఆటోలో, మర్నాడు ఉదయం ఆరుగంటలకల్లా వసుంధర, కీర్తన వాళ్ళు ఉండే లబ్బీపేటలోని అపార్ట్ మెంట్స్‌కి వచ్చింది జానకి. కూతురు మనవరాలు అప్పటికీ లేచారు. సోఫాలో తమ మధ్య కీర్తనను కూర్చోబెట్టుకుని జానకి చెప్పింది. "కీర్తీ! ఇది నీకే.." ఆ గ్రీటింగ్‌ని మనవరాలికి అందించింది.

"డాడీ నీ కోసం పంపారు!"

"నాకు తెలుసు. నేను చెప్పలా" అంది కీర్తన వెలిగే కళ్ళతో. "..అమ్మమ్మా! చదవవా డాడీ ఏం రాసారో?"

"హేపీ బర్త్ డే! ఫ్రమ్ యువర్ డాడ్.." జానకి చదువుతోంది. "..పాపా! మేం ఎవరా అని నువ్వు ఆశ్చర్యపడ్తూ ఉండి ఉంటావ్. నవంబర్‌లో ఒక రోజు మా బాబు జాక్సన్, వాళ్ళ డాడ్ ప్రొద్దున్న జాగింగ్ చేస్తున్నప్పుడు గార్డెన్‌లో ఒక చోట, మా జాక్సన్‌కి ఒకటి కనిపిం చింది. ఏంటో తెలుసా అదీ....నువ్వు డాడీ కోసం పంపిన బెలూన్" జానకి ఓ క్షణం ఆగింది.

ఒకే ఒక్క నీటి చుక్క కీర్తన కన్నుల్లోంచి జారుతూ వస్తోంది!

"..స్వర్గంలో షాప్స్ లేవట. అందుకని డాడీ మమ్మల్ని షాపింగ్‌కి పంపారు-నీకు బర్త్‌డే గ్రీటింగ్స్ కొనమని. నాకు తెలుసు-మీ డాడీ కోరుకునేది నువ్వె ప్పుడూ సంతోషంగా ఉండాలనే కానీ విచారంగా ఉండ టాన్ని కాదని. హీ లవ్స్ యు వెరీ మచ్. పై నుంచి ఆయనెప్పుడూ నిన్ను చూస్తూనే ఉంటారు. లాట్స్ ఆఫ్ లవ్ రమ్య"

అమ్మమ్మ చేతిలోని ఆ గ్రీటింగ్ కార్డ్‌ని అందుకుని, పెదవులకు ఆన్చుకుంది కీర్తన!

★★★

కళ్ళ ముందు కదిలిన గతం, డాక్టర్ కీర్తన హృద యాన్ని బరువెక్కించింది. రెండు క్షణాల్లో మళ్ళీ ఆమె మామూలుగా అయిపోయింది. ఎదురుగా ఉన్న ఆ పాప భుజం మీద ఆప్యాయంగా చేయి వేసింది.

"డాడీకి ఏం కాదు. నేనున్నాగా. ఆపరేషన్ చేస్తే బాగైపోతుంది. ఏడవకు. ఓకే" చెప్పింది వేలితో ఆ పాప బుగ్గల మీది నీటిని తుడిచి.

"డాక్టర్ దశరథ్!" పిల్చింది. "..వెంటనే ఆపరేష న్‌కి ఏర్పాటు చేయండి. క్విక్!" కాలిఫోర్నియాలో ఉన్న తన తల్లి రమ్యతో మాట్లాడ్తున్నాడు. ముప్పై రెండేళ్ళ జాక్సన్. సంభాషణంతా ఇంగ్లీషులోనే సాగుతోంది.

"మమ్మీ..ఈరోజు నీ కోడలు ఒక అరుదైన ఆపరే షన్‌ని సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించింది. 'ఆర్‌ఎఫ్'- ఎబ్లే షన్ అనే కొత్త టెక్నిక్‌తో ఒకతన్ని బ్రతికించింది. దాదాపు పది గంటలు ఆపరేషన్ థియేటర్‌లోంచి బయటకు రాలేదు. ఎలక్ట్రోఫిజియాలజీ ఎక్స్‌పర్ట్స్ కూడా చేయలేని క్లిష్టమైన ఆపరేషన్‌ని చాకచక్యంగా చేసింది. వియ్ మస్ట్ ఆల్ బి ప్రౌడ్ ఆఫ్ హెర్"

"జాక్సన్! దురదృష్టం అనేది మనలోని విల్ పవ ర్‌నీ, గొప్పదనాన్ని నిరూపణ చేసుకునేందుకు అందివ చ్చిన ఒక అవకాశంగా భావించాలట. చాలా చిన్నతనం లోనే తండ్రి గుండెజబ్బుతో మరణించాడన్న వాస్తవం కీర్తనలో ఒకరకమైన పట్టుదలని పెంచింది. హార్ట్ డిసీ జెస్ మీదే యుద్ధం చేయాలన్న దృఢ సంకల్పాన్ని ఆమెలో నింపి, ఒక అపూర్వమైన కార్డియాక్ సర్జన్‌గా ఆమెను మలచింది! ఏ పసిపాపకూ తన లాంటి దుస్థితి కలుగనీయదు కీర్తన. బైదివే మీ అత్తగారు బావున్నారా?"

"బావున్నారు"

"ఏం చేస్తున్నావ్?"

"ఇప్పుడే హాస్పిటల్ నుండి వచ్చి డ్రెస్ ఛేంజ్ చేసుకోబోతున్న కీర్తినీ, వాళ్ళ మమ్మీ వచ్చేసిందన్న సంతోషంతో బుల్లి బుల్లి అడుగులేసుకుంటూ పరిగెట్టుకెళ్తున్న నీ మనవడ్నీ చూస్తూ నీతో మాట్లాడుతున్నా!"

★

